
# ఆవకాయ చెట్టు

కేశిరాజు ఫణి ప్రసాద్

మిట్టమధ్యాహ్నం. అందులోనూ వేసవికాలం! బస్సులో ప్రయాణం! అతి సాధారణమైన బస్సు! ఇక ప్రయాణం ఎలా వుందో చెప్పవలసిన అవసరమేముంటుంది! ఇటువంటి ప్రయాణానికి కారణం మా ఆయన! ఏమయినా అనుకున్నారంటే అది అమలు చేస్తేనేగాని వదిలిపెట్టని తత్వం!



''చూడు సూర్యమోహన్, ఒక ఆదివారం నాడు నువ్వు మీ ఆవిడని తీసుకుని ఎలాగైనా ఆ ఊరు వెళ్ళి తీరాల్సిందే! నిర్లక్ష్యంగా ఊరుకుంటే మళ్ళీ వేసవి వరకూ ఆగాలి!'' అంటూ మావారికి ఆఫీసులో వాళ్ళు మరీమరీ చెప్పారు. విశాఖపట్నానికి చాలా దూరంగా వున్న ఒక చిన్న పల్లెటూరు!

''ఈ ఆదివారం ప్రొద్దునే మనం బస్సులో వెడుతున్నాం'' అని నిన్న సాయంత్రం ఆఫీసు నుంచి రాగానే చెప్పారు. ప్రయాణానికి నేను ఇష్టపడలేదు.

''చూడు జయంతి. ఆ ఊరికి నువ్వు నేనూ మొట్టమొదట కలిసివెళ్ళాలి! ఎందుకంటే మళ్ళీ అవసరమొచ్చినప్పుడు నువ్వో, నేనో ఒక్కరే వెళ్ళి రావచ్చు'' అని మావారు చెప్పారు.

తప్పేది లేదు! తప్పించుకోవడానికి ఏమాత్రం వీలులేని స్థితి! ఎందుకంటే మావారు తీసుకునే నిర్ణయం బాగా ఆలోచించి మరీ తీసుకుంటారు. ఒకటిరెండుసార్లు చెప్పి చూస్తారు. అప్పటికీ కాదంటే ఇక మాట్లాడరు. అలాగని వాదించడం ఒప్పించడం లాంటివి జరగవు! మౌనంగా వుంటారు. ఆ మౌనం ఎన్నాళ్ళు అని తెలియదు. తెలుసుకునేందుకు అవకాశమివ్వరు. కాపురం చేస్తున్నప్పుడు కష్టసుఖాలు తప్పవుగా! ఇది నా మనస్తత్వం. అందుకే మా అబ్బాయి చిన్నిని కూడా తీసుకుని ప్రయాణం!

విసుగ్గా ఒకటి రెండుసార్లు రిస్ట్‌వాచీ చూసుకున్నాను. ''మనం వెళ్ళే ఊరు ఇంకా ఎంత దూరముంటుంది'' పక్కనే కూర్చున్న శ్రీవారిని అడిగాను. నా మాటకు వెంటనే జవాబు చెప్పలేదు.

''ఇద్దరం కూడా వెళ్ళేది మొదటిసారి! నీకెంత తెలుసో, నాకూ అంతే తెలుసు'' అని చదువుతున్న పుస్తకం పేజీ తిప్పారు.

ఒక్కసారి బస్సులో వున్నవాళ్ళని పరిశీలనగా చూశాను. కొందరు పక్కవాళ్ళతో కబుర్లు చెప్పుకుంటున్నారు. ఇంకొంతమంది సినిమాల గురించి మాట్లాడుకుంటున్నారు. మరో ఇద్దరు ముగ్గురు సిగరెట్ కాల్చుకుంటున్నారు.

ఊరు పేరు చెప్పి ఎప్పుడు చేరతామో ఎవరినైనా అడగాలనుకున్నాను. మరుక్షణమే ఆ ఆలోచన అణిచివేసుకున్నాను.

ప్రయాణాల్లో మావారు ఎవరితోనూ మాట్లాడరు. అలా మాట్లాడడం వల్ల అనుకోకుండా వాదనలొచ్చే ప్రమాదముందని మావారి ఉద్దేశం! ఆలోచిస్తే అది కూడా నిజమే! అందుకే నేనూ అలాగే వుండడం నేర్చుకున్నాను.

ప్రస్తుతం నాకు ఊరి పేరు కూడా జ్ఞాపకం లేదు. మా ఆయన్ని అడిగి కూడా ప్రయోజనం లేదు. కానీ ఒక్క ప్రశ్నకి మాత్రం ఎంత ఆలోచించినా జవాబు దొరకడం లేదు. అప్రయత్నంగా మావారిని చూశాను.

''అన్ని విషయాలు ఆ ఊరెళ్ళాక నీకే అర్థమవుతాయి'' – ఇంటి దగ్గర వారు చెప్పిన మాటలు! మాట్లాడొద్దంటోంది మనసు!

నన్ను మాట్లాడొద్దన్న మనసు, తను ఊరికే కూర్చుందా! ఆలోచిస్తోంది. మనసుకి నిలకడ లేదంటే ఇదే!

ఈ ప్రయాణం ఎక్కడికనే ఆలోచన పదేపదే నాలో కలుగుతోంది. పక్కనే కూర్చున్న మావారిని ఓరకంటితో చూశాను.

ఎంతో నిలకడగా కూర్చున్నాను. ప్రయాణం గురించి ధ్యాసే లేదు. నాకు ఆశ్చర్యం కలిగింది ఈసారి ఆయన్ని పరిశీలనగా చూశాను. అంతే! చటుక్కున నాలో మరో అనుమానం. సాధారణంగా మావారికి ఉన్న ఊరునుంచి మరో ఊరికి వెళ్ళడానికి మనసొప్పదు. అటు వాళ్ళవైపు, ఇటు మావైపు బంధువుల ఇళ్ళల్లో పెళ్ళిళ్ళు జరిగినా వెళ్ళరు. శుభాకాంక్షలు పంపిస్తారు. శుభకార్యాలకైతే ఏదో నెపం మీద తప్పించుకుంటారు. తప్పనిసరైతే మా చిన్నిగాడిని పంపిస్తారు.

మా ద్వారా పంపించిన కానుకలు చూసి మావారి ఘనతను పొగుడుతూ ఆయన రాలేదన్న విషయం ఎంతటివాళ్ళయినా మర్చిపోతారు.

ఇది స్వామివారి స్వభావం. వారి విశిష్టమైన వ్యక్తిత్వం. కాని ప్రస్తుత పరిస్థితి అందుకు పూర్తి వ్యతిరేకంగా వుంది. ఎక్కింది మామూలు ప్రైవేటు బస్సు. వెళ్ళేది దూరప్రయాణం. పొద్దున్న పది గంటలకు బస్సెక్కాం. ఎగుడు దిగుడు రోడ్డు మీద బస్సు వెడుతోంది. బస్సు కుదుపులకు నాకైతే చిరాకుగా వుంది. కాని ఆయన మాత్రం ఎంతో ఓపికగా ప్రశాంతంగా కూర్చుని పుస్తకం చదువుకుంటున్నారు. చుట్టుపక్కల పరిసరాలని మర్చిపోయి మరీ కూర్చున్నారు.

ఒకపక్క ఆశ్చర్యం! మరోపక్క కారణంకోసం ఆరాటం!

ఏదో చిన్న ఊరు. బస్సు ఆగింది. చదువుతున్న పుస్తకం మూసేసి నావైపు చూశారు. ఆమాత్రం కదలిక నన్నెంతో ఉత్సాహపరిచింది.

రిస్ట్‌వాచీ చూసుకున్నారు. ''నేను కాఫీ తాగుతాను. నువ్వేం తీసుకుంటావు. ఏమైనా తింటావా?'' బస్‌లోంచి దిగుతూ అడిగారు.

''నాన్నా నేను కూల్‌డ్రింక్ తాగుతాను'' లేవబోతున్న వాడిని ఆపి తనే తీసుకొస్తానన్నారు.

ప్రయాణాల్లో బయట తిండి తినను! ఇంటి నుంచి తెచ్చుకున్న జంతికల ప ఒట్లం పైకి తీశాను. నేనూ, మావాడు జంతికలు తిని, మంచినీళ్ళు తాగాం! బస్సు కదిలే సమయానికి ఆయనొచ్చి కూర్చున్నారు!

బస్సు బయలుదేరింది! నాలుగు గంటలు దాటింది! సాయంత్రపు నీరెండలో చుట్టుపక్కల చెట్లు చేలు ఆహ్లాదంగా కనిపిస్తున్నాయి.

''జయంతీ...'' మావారి పిలుపు విని ఆయన వైపు జరిగి కూర్చున్నాను!

''ఏంటండి'' అడిగాను! ఒక్కక్షణం నావైపు చూశారు. మళ్ళీ ''ఏం లేదులే'' అని మాట్లాడకుండా వుండిపోయారు.


నిట్టూర్పు వదిలి ఊరుకున్నాను. ఈయన వరస చూస్తుంటే ఎంతో ముఖ్యమైన పనుండే వుంటుంది. ఆ పనేమిటో నాకు చెప్పొచ్చుగా. చెప్పరు! మండుతున్న మనసుని బలవంతంగా చల్లార్చుకున్నాను.

'ఒద్దు ఆవేశం వద్దు, ఓపికగా వుండు' మనసు ఓదార్పు!

రాత్రి ఎనిమిది గంటలు. ప్రశాంతమైన చోటు. సాయంకాలం చీకటిపడుతుండగా ఆ ఊరు చేరుకున్నాం. చిన్న పల్లెటూరు. ఆ ఊళ్ళో ఉంటున్న జనం కూడా తక్కువేమీకాదు.

బస్ దిగిన వెంటనే ఈ రాత్రికి ఎక్కడ వుండాలో అని ఒకళ్ళిద్దరిని అడిగి తెలుసుకోవాల్సి వచ్చింది. ఉన్న ఒక్కచోటు చెప్పారు. అది ఒక పూటకూళ్ళమ్మ ఇల్లు. ఊళ్ళోకి వచ్చిన కొత్తవాళ్ళుండే వసతులున్న ఇల్లు ఒక్కటే! చూడటానికి పూరిపాకయినా చెట్ల మధ్య వుంది. పైగా విశాలంగా కూడా వుంది. మాతోపాటు మరికొంతమంది కూడా వున్నారు.

భోజనాలు చేశాక పడుకోవడానికి ఆరుబయట మడత మంచాలు ఇచ్చారు. ఏ మాటకామాటే చెప్పుకోవాలి. పేరుకి పల్లెటూరయినా సౌకర్యాలు



వచ్చాయి. దాహం తీర్చే స్వచ్ఛమైన నీరు, మంచి రుచికరమైన భోజనం, పడుకోవడానికి మడత మంచాలు! పైగా ఎటు చూసినా వెన్నెల! ఒక్కమాటలో చెప్పాలంటే స్వచ్ఛమైన గాలి, నీరు, ఆహారం పల్లెటూళ్ళోనే దొరుకుతుంది. ప్రకృతి కూడా మనిషిని ఆహ్లాదంగా పలకరించేది పల్లెటూళ్ళలోనే!

మడత మంచంమీద పడుకోవడమంటే, నాకూ మావారికి కూడా ఎంతో ఇష్టం. అందుకుతోడు చెట్ల మధ్యగా వుండడంతో చెట్ల నుంచి వస్తున్న కమ్మటి వాసన శరీరానికి మరింత హాయినిస్తోంది.

ఇలా పరవశిస్తూ అనుకోకుండా మా శ్రీవారిని చూశాను.

మడత మంచంమీద వెల్లకిలా పడుకున్నారు. వెన్నెల చల్లదనంతోపాటు వాక్‌మన్‌లో పాత సినిమా పాటలు వింటున్నారు.

పాత సినిమా పాటలు రోజూ వింటూనే వుంటారు. కాని ఇవ్వాళ వెన్నెల్లో పడుకుని వింటున్నారేమో పూర్తిగా పాటల్లో లీనమైపోయారు.

''ఏమండీ'' మెల్లిగా పలకరించాను! నా పిలుపు వినిపించుకునే స్థితిలో లేరు. పాటలు వింటూ తను కూడా పాడుకుంటున్నారు. మళ్ళీ పిలవటానికి మనసొప్పలేదు. మంచి అనుభూతిని పాడుచెయ్యకూడదు!

కొంచెంసేపటికి పాటలు వినడం పూర్తయినట్టుంది. ఆయనే లేచి వాక్‌మన్ ఆపుచేశారు.

''జయంతీ ఎలా వుందీ చోటు, చాలా బావుంది కదూ'' పలకరింపుగా అడిగారు. మా పెళ్ళయి హనీమూన్‌కి వెళ్ళినప్పుడు కూడా ఈ మాట అడగలేదు. చటుక్కున జ్ఞాపకమొచ్చి నాలో నేనే మెల్లిగా నవ్వుకున్నాను.

''ఈ ఊరు, ఈ వాతావరణం ఎంతో బాగున్నాయి. ఇటువంటిచోటుకి రావడం నాకు మొదటిసారి'' మనస్ఫూర్తిగా చెప్పాను.

''అదిసరే, ఇంతకీ మనమీఊరెందుకు వచ్చినట్టు?'' అసలు విషయం అడిగాను. ''అక్కడే వుంది గమ్మత్తు! ఇక్కడ ఊరగాయలు బాగుంటాయట! కొనుక్కుని తీసుకెళ్ళాలని ఎప్పటినుంచో నా ఆశ! ఇవ్వాళ్టికి వీలుపడింది'' నవ్వుతూ చెప్పారు మావారు.

అంతే! ఊరగాయలకోసమా ... అర్థం చేసుకోలేని పరిస్థితి!

అటువంటి పరిస్థితిలోనే ఉండిపోయిన నేను ఎప్పుడు నిద్రపోయానో తెలీదు.

తెల్లవారింది. మా ఆయన నాకంటే ముందే లేచినట్టున్నారు.

''జయంతి త్వరగా తయారవ్వు. వేడివేడి ఇడ్లీలు తిందాం'' ఎంతో ఉత్సాహంతో కూడిన మేలుకొలుపు.

స్నానం చేయటం, టిఫిన్ తిని కాఫీ తాగడం పూర్తయింది. ఈలోగా మావారు ఊళ్ళో అటూ ఇటూ తిరిగొచ్చారు. పరిసరాలన్నీ చెట్లతో చూడ ముచ్చటగా వున్నాయి. కాని ఎక్కువగా మామిడి చెట్లు పెద్దపెద్ద కాయలతో కొమ్మలన్నీ నేలమీదే వాలినట్లున్నాయి.

'ఈ ఊళ్ళో ఊరగాయలు మంచి రుచిగా వుంటాయి' అనుకోకుండా రాత్రి మావారు నాతో చెప్పిన మాట మనసులో మెదిలింది.

చుట్టూ రకరకాల మామిడిచెట్లు! మావారి మాట నిజమే!

వెంటనే మరో ఆలోచన. 'ఊరగాయలు కొనుక్కోవటానికి మరీ ఇంతదూరం రావాలా, పైగా ఈమాట ఇక్కడికొచ్చేవరకు నాతో ఎందుకు చెప్పలేదు?'

పేపరు చదువుతున్న మావారిని అదే విషయం అడిగాను!

పేపరు మడిచి పక్కనపడేశారు. ''ఈమాట నీతో ముందే చెపితే నువ్వు ఒప్పుకోవు. నాతో ఇంత దూరం రావటానికి ఇష్టపడవు. అలాగని ఊరుకునే తత్వం కాదు నీది! మీ పుట్టింటినుంచి మనకోసం ప్రత్యేకంగా తెప్పిస్తావు. లేకపోతే నువ్వే వెళ్ళి తీసుకొస్తావు. ఈ ఏడాదయినా మంచి రుచిగల ఊరగాయ తినొచ్చు కదా'' విషయం క్లుప్తంగానే ఉంది. కానీ మాట్లాడిన తీరు మనసుని గిల్లుతోంది. సహించలేకపోయాను.

విశాలమైన ఆవరణ. చూడటానికి అదొక పూరిపాక. ఆ పాకచుట్టూ వెదురు దడి కట్టారు. వచ్చిన వాళ్ళు పాక ముందున్న నులక మంచాల మీద కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. తడిక తలుపు ఒరగా వేసి వుంది. ఎంతో శుభ్రంగా కడిగిన సీసాలు అడుగున తడి ఆరటానికి తాటాకు చాపమీద బోర్లించున్నాయి.

''మావాళ్ళు పెట్టిన ఊరగాయ తినమని నేనెప్పుడూ మిమ్మల్ని బలవంతం చెయ్యలేదు. మన ఊళ్ళోనే ఊరగాయలు పెట్టుకోవచ్చుగా'' ఒళ్ళు మండిపోతోంది.

''చూడు అమ్మడూ. ఊరగాయలు పెట్టడం కష్టమేమీ కాదు. కాని మంచి రుచిగా వుండేటట్టుగా పెట్టుకోవడం తెలుసుకోవాలి. కావలసిన వస్తువులు సమపాళ్ళలో కలపడం అంత తేలిక కాదు. అందుకు అలవాటు వుండాలి. ఎంతో అనుభవం వుండాలి. పైగా ఊరగాయలు నిలవుంచటంలో ఎంతో జాగ్రత్తలవసరం. సంవత్సరం పాటు రుచిగా వుండేటట్టుగా పెట్టుకోవాలి''.

'ఎప్పుడూ ఏదో ఒకటి తినేసి హడావుడిగా ఆఫీసుకెళ్ళే మావారికి ఏడాదికొకసారి పెట్టుకునే పచ్చళ్ళ మీద ఇంత అవగాహన ఉందా?'

మావారిని చూస్తుంటే ఎంతో ఆశ్చర్యం! మంచి రుచిగల ఊరగాయ పచ్చళ్ళు ఈ ఊళ్ళో దొరుతాయని తెలుసుకుని మరీ వచ్చిన పతిదేవుల అభిరుచిని వింటూంటే మాట్లాడటానికి ఏమీ తోచని స్థితి.

''సరేగాని మన ఇంట్లోకి కావలసినవి, నీకిష్టమైనవి ఊరగాయలు ఎంతెంత కావాలో ఆలోచించి మరీ చెప్పు!''

పెన్ను, కాగితం తీసుకుని తయారయ్యారు. ఎందుకో ఒక్కసారి వారిని పరిశీలనగా చూస్తూ కూర్చున్నాను. పైకి కనపడడం లేదుగానీ, సమయస్ఫూర్తిగల దొరగారు!

అలా అనుకుంటూ ఆయనతో బయలుదేరాను.

చెట్ల మధ్యనున్న దారిలో నడుచుకుంటూ వెడుతున్నాం. మాతోపాటు వస్తున్నవాళ్ళు, ఊరగాయ సీసాలతో తిరిగొస్తున్నవాళ్ళు ఇదంతా చూస్తున్న నేను మావారివైపు చూశాను.

''ఈ ఊరు ఊరగాయలకు పెట్టింది పేరు'' ఆయన అన్న మాటలకి వాస్తవరూపం ప్రత్యక్షంగా కనపడుతోంది.

తమకి దొరికిన పచ్చళ్ళను మెచ్చుకుంటూ వాటిని ఎంతో అపురూపంగా తీసుకెళుతున్న వాళ్ళని చూస్తుంటే అక్కడికి త్వరగా చేరుకోవాలని మరింత వేగంగా నడిచారు. నేను ముందు, వెనక మావారు!

విశాలమైన ఆవరణ. చూడటానికి అదొక పూరి పాక. ఆ పాకచుట్టూ వెదురు దడి కట్టారు. వచ్చిన వాళ్ళు పాక ముందున్న నులకమంచాల మీద కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. తడిక తలుపు ఒరగా వేసి వుంది. ఎంతో శుభ్రంగా కడిగిన సీసాలు అడుగున తడి ఆరటానికి తాటాకు చాప మీద బోర్లించున్నాయి.

ఖాళీగా వున్నచోట కూర్చున్నాం. ఊరగాయల తయారీ లోపల జరుగుతోంది. కమ్మటి వాసన పరిసరాలను ఘుమఘుమలాడిస్తోంది.

''ఇక్కడి రావటానికి ఓపికుండాలేగాని, తస్సాదియ్యా, తిరిగి వెళ్ళేటప్పుడు ఎంత తొందరగా ఇంటికెళ్ళి ఈ పచ్చడి మెతుకులు తింటామా అని ఒకటే ఆరాటంగా వుంటుందిరా'' అక్కడకొచ్చిన వాళ్ళ మాటలు!

''ఆ మాటకేంగానీ, ఇంత రుచిగా చేసే ఆ మామ్మగారిని ఎంత గొప్పగా చెప్పుకున్నా మళ్ళీ మళ్ళీ చెప్పుకోవాలనిపిస్తుంది''

''అంతేకాదురా అబ్బాయి అసలు గొప్పతనమంతా మామ్మగారి మనసులోనే వుంది''.

ఒక ముసలాయన ఖచ్చితంగా చెప్పిన అభిప్రాయం!

ఒకపక్క వీళ్ళూవాళ్ళు అనుకునే మాటలు, మరోపక్క చేతిలో పచ్చళ్ళతో ఎంతో తృప్తిగా వెడుతున్నవాళ్ళు. చూస్తుంటే ఎంతో ముచ్చటగా వుంది.

ఒక్కసారి మా శ్రీవారి వైపు చూశాను. మాట్లాడకుండా ఎటో చూస్తూ ఆలోచనలో వున్నారు.

అంతమంది జనం వున్నా, తోసుకోడాలు, తొక్కిసలాటలు వంటివి ఎక్కడా లేవు. ఎవరికివారే తమ వంతు వచ్చేవరకు ప్రశాంతంగా ఎదురుచూస్తున్నారు. అక్కడివాళ్ళ ప్రశాంతత వల్ల ఆ ఆవరణకే చెప్పలేని నిండుతనాన్ని తెచ్చిపెట్టింది.

మా చిన్నాగాడు చేతిలో మావిడికాయ తింటూ మా దగ్గరికొచ్చాడు. మామూలపుడ యితే ఒద్దనే వాళ్ళమే! కాని ఆ క్షణంలో నేను మావారు కూడా వాడు తింటున్న కాయలోంచి చెరోముక్క తీసుకుని తింటున్నాం.

'అబ్బ ఎంత రుచిగా వున్నాయి' మా ఇద్ద రిలో ఒకటే అనుభూతి.

''సూర్యంగారు, కాస్సేపటిలో మిమ్మల్ని పిలుస్తారు. రెడీగా వుండండి'' అక్కడి వాళ్ళలో ఒకరొచ్చి చెప్పారు. ఎంత టైమయిందోనన్న ధ్యాసకూడా లేదు.

''బాబూ వాళ్ళని రమ్మను'' అనగానే మా దగ్గరికొకాయన వచ్చి చెప్పారు.

నేను, మావారు లేచి, తడిక తలుపు మెల్లగా జరిపి లోపలికెళ్ళాం.

కళ్ళకి చీకట్లు కమ్మాయి. మా ఊపిరి వడదె బ్బలా తగిలింది!

ఊహించని క్షణం! మా బ్రతుకు పుస్తకంలో వెనక్కి తిప్పేసిన పేజీలు, అందులోని సన్నివే శాలను మళ్ళీ మా కళ్ళముందుకు తీసుకొచ్చిన క్షణం!

అందుకే మా ఊపిరి మాకే వడదెబ్బలా తగి లింది. అతికష్టంమీద తెప్పరిల్లాం! కొన్ని క్షణాలు మౌనంగా వుండిపోయాం!

''అమ్మా'' అంటూ ఆయన, ''అత్తయ్య గారూ'' అంటూ నేనూ ఒకేసారి పిలిచాం. అలా పిలుస్తున్నప్పుడు పెదవులు వణుకుతున్నాయి!

మా గతం మా మనసుని అతలాకుతలం చేసేస్తోంది. అయినా భరించవలసిందే! తప్పదు.

అవి నేను కాపురానికొచ్చిన కొత్త రోజులు! సరదాలు, షికార్లు! పొద్దున వెడితే ఇంటికొచ్చేసరికి రాత్రయ్యేది. టైము తెలిసేది కాదు. డబ్బు ఎంత ఖర్చయిపోతోందో పట్టించుకునేవాళ్ళం కాదు.

''సరదాలు, సంతోషాలుండొచ్చు! కాని ఖర్చుల సంగతి కూడా చూసుకో వలి! ఇప్పటినుంచే డబ్బు వెనకేసు కుంటే ముందుముందు ఎంతో సుఖప డతారు'' అత్తగారు హెచ్చరిస్తుండే వారు.

మావారొక్కగానొక్క కొడుకు. ''విం దులు వినోదాలు ఇప్పుడు కాకపోతే మరెప్పుడు'' వినిపించుకోని మావారి పెంకితనం.

''అమ్మా నేనొక పెద్ద ఆఫీసరుని! ఎంత డబ్బు ఖర్చుపెట్టినా అంతకు రెట్టింపు సంపాదించుకోగలను'' ఎంతో ధీమాగా మావారంటూ వుండేవారు.

కాలం ఎంతో విలువైనది. పైగా ఎంతో బలమైనది కూడా బాధ్యతలను నిర్వర్తించమని నిలదీసింది. మావారి జీతం సరిపోయేది కాదు. మా అత్త గారు తనకొచ్చే పెన్షన్ డబ్బులతో సర్దు బాటు చేసేవారు. ఇక లోటేమిటి!

మానుకోలేని అలవాట్లు. జీవన గమనంలో తప్పటడుగులు. అప్పులు. పెద్దమొత్తంలో అప్పులు. బ్రతుకు బరువైపోతోంది! ఎటూ తోచని పరిస్థితి. ఆఫీసుకెళితే అప్పులవాళ్ళు పట్టుకుంటారని మాటిమాటికి ఆఫీసు మానేసే వారు. అది కూడా జీతం నష్టం మీద!

ఒక్కగానొక్క కొడుకు మనసు కలతపడ టంతో కన్నతల్లి కళ్ళల్లో నీళ్ళు. మావయ్యగారు తలదాచుకోమనిచ్చిన సొంత ఇంటిని అత్తయ్య గారు అమ్మేశారు. ప్రేగుబంధానికి బందీగా మిగిలిపోయారు.

స్థిమితపడిన హృదయాలతో కొంతకాలం బాగానే వున్నాం. మనసుకి నిలకడ లేనపుడు మనిషికి ఇబ్బందులు తప్పవు. మరోసారి డబ్బు కావాల్సి వచ్చింది మావారికి! అత్తయ్యగారిని అడగాలి? ఎలా?

''ప్రస్తుతం మొక్కలు కొని పెంచితే భవిష్య త్‌లో వచ్చే ఆదాయం'' పేపరులో ప్రకటన చూపించి ఆవిడ పేరుమీద మొక్కలు కొంటాన న్నారు. మా అత్తగారు ఒప్పుకున్నారు. మా అత్త గారు పాతకాలం మనిషి. పెద్దగా చదువుకో లేదు.

''మొక్కలు కొన్నారు కదా, ఏవిరా అబ్బాయి'' ఆఫీసు నుంచి రాగానే వారిని అడు గుతుండేవారు. ఏదోఒకటి చెప్పేవారు. ''నీ మొక్కల గురించే తప్ప, నాకు వేరే పనేమీ లేద నుకున్నావా?'' విసుక్కోవడం, చిరాకుపడడం – తరువాత పరిస్థితి.

అంతే! మళ్ళీ ఎప్పుడూ ఆ విషయం ప్రస్తావించలేదు అత్తయ్య గారు. కొన్నిరోజుల తర్వాత, మావారికి అత్తయ్యగారికి మధ్య మాటలు తగ్గిపో యాయి. ఇద్దరి మధ్యా మౌనం. మౌనం మామూలుది కాదని నాలో భయం!

గాయపడిన హృదయం తాలూకు మౌనం! అందుకే నేను భయపడుతు న్నది. అనుక్షణం నాలో ఒక ప్రశ్న. ఆవిడ మౌనంలో పెనుతుఫాను చెలరే గుతోందా? అగ్నిగుండం ప్రజ్వరిల్లు తోందా? మనుసుకు కలిగిన ఎటువంటి గాయమైనా మాన్పించే శక్తి కాలానికి వుంది. కాని ఒక తల్లి మనసు గాయాన్ని మరిపించే శక్తి మాత్రం కాలానికి లేదు!

నాలో ఒక జ్ఞాపకం! తలచుకున్న ప్పుడల్లా హృదయం చేదుగా అవు తోంది.


పొద్దునే లేచి తమ పనులన్నీ త్వరగా పూర్తి చేసుకున్నారు.

'అత్తయ్యగారూ' అనే పిలుపు నోట్లోనే వుండిపోయింది. నాలోని భయం నోరు మూసేసింది. మావారు భోజనం చేసి ఆఫీసుకెళ్ళిపోయారు. నా



## గాయానికో నగ

**బా**డీని బ్యూటిఫుల్‌గా చూపించుకోవడం అంటే అదో గొప్ప ఫేషన్ మాత్రమే కాదు. పాషన్ కూడా. నిగనిగ లాడే శరీరంమీద, మిలమిల మెరిసిపోయే పచ్చబొట్లు మొన్నటి వరకు ఒక క్రేజ్ అయితే, ఇప్పుడు బాడీ పీర్సింగ్ ఒక పెద్ద మోజయింది. చెవులమీద, కనుబొమ లమీద, ముక్కుపుటాలకింద, కిందపెదవి మీద, నాలిక అంచుచివర, బొడ్డుపైన.. ఇలా బాడీలో చాలా చోట్ల వీటిని అలంకారంగా దిద్దుకోవడం.. సెక్సీగా కన్పించడం ఒక వ్యామోహమైపోయింది. అంతవరకు బాగానే వుంటుంది. కానీ, శరీరంలోని సెన్సిటివ్ భాగాల్లో వీటి అమరిక వల్ల బ్యాక్టీరియా చేరి వివిధరకా లయిన వ్యాధులకు గురిచేస్తుందని డాక్టర్లు చెప్తున్నారు. పరిశుభ్రమైన, సురక్షితమైన, ప్రొఫెషనల్ వాతావర ణంతో కూడిన చోట మాత్రమే బాడీ పీర్సింగ్ చేయించుకోవాలి. వీటి అమరికలో ముందు, తర్వాత కూడా యాంటిసెప్టిక్ తప్పనిసరిగా ఉపయోగించాలి. శుభ్రమైన, పదునైన– డిస్పోజబుల్ కొత్త సూదు లను వాడాలి. ఎంచుకున్న ఆభరణాన్ని సూదికెక్కించేముందు స్టెరి లైజ్ చేసి వుండాలి. అమర్చిన తర్వాత సున్నితమైన చోట్ల ఎర్రగా కంది, ఆ ఎరుపు తగ్గకుండా బాధపెడ్తున్నా, చర్మాన్ని నొక్కి పెడుతు న్నట్టుండి, మంట పెడ్తున్నా, రక్తం వస్తున్నా, చీము పట్టినా– అలక్ష్యం చేయకుండా వెంటనే డాక్టర్‌ని కలవాలి. అంతకంటే ఉత్తమం– వెర్రివ్యామోహాలకు పోకుండా వుండటమే అంటూ సలహాలిస్తున్నారు డాక్టర్లు. అయినా సరే హు కేర్స్ అన్నట్టు– ఇలా అందాలను పెంచి, చూపించుకోవడంలోనే అందమైనా, ఆనందమైనా అంటున్నారు యూత్. క్రేజీ ఫాషన్ అంటే ఇదే.




భోజనం కూడా పూర్తయింది.

రూములో కూర్చుని పుస్తకం చదువుకుంటున్నాను.

''అమ్మాయి. ఒక ముఖ్యమైన పనిమీద వెడుతున్నాను'' అత్తయ్యగారి మాటకు సరేనని లోపలి నుంచే జవాబిచ్చాను.

తెలియకుండానే నిద్రపట్టేసింది. హఠాత్తుగా మెలకువొచ్చి లేచాను. అత్తయ్యగారొచ్చేసుంటారనుకుంటూ వీధి గదిలోకొచ్చాను. తలుపులు దగ్గరగా వేసున్నాయి. వెంటనే వంటింట్లోకొచ్చి చూశాను. మడిగట్టుకుని వంట చేసుకుని భోజనం చేస్తారావిడ! కాని ఆవేళ భోజనం చేసినట్టుగా లేదు. వెంటనే చివుక్కున మనసు కంట తడిపెట్టించింది.

మరుక్షణం నాలో కంగారు. ఆఫీసుకు ఫోన్ చేసి చెప్పాను. ''అనవసరంగా భయపడకు. పనిమీద వెళ్ళిందంటున్నావుగా. ఆవిడే వస్తుంది'' మావారు చెప్పినా నాకు నమ్మకం కలగడం లేదు.

సాయంత్రమయింది. చీకటిపడ్డాక వచ్చిన మావారిని ''పెద్దావిడ ఎటు వెళ్ళారో ఎవరినైనా కనుక్కోండి'' నాలో ఒకటే ఆరాటం! ఒక గంటసేపటికి తిరిగొచ్చారు. ''మా అమ్మ వచ్చిందా'' అని నన్నడిగారు. ఆయన కంఠంలో బేలతనం! నీళ్ళు నిండిన కళ్ళతో ఆయన్ని చూడలేక తలొంచుకున్నాను.

ఆవిడ రాలేదు. సంవత్సరాలు గడిచిపోతున్నాయి! అత్తయ్యగారు రాలేదు.

''పెద్దవాళ్ళున్న ఇల్లు నిండుతనంతో కళకళలాడుతుంటుంది'' అమ్మ చెప్పిన మాటలు జ్ఞాపకానికొచ్చాయి. నిజం నాకు అనుభవపూర్వకంగా అర్థమయింది.

జీవితంలో వెలితి! పైగా చెప్పుకోవటానికి ఎవరూ లేరు. ఒంటరితనంతో జీవితం వెలవెలబోతోంది. క్రమేపి నన్ను నేనే ఓదార్చుకోవటానికి అలవాటుపడ్డాను.

''అదంతా సరే! జరిగిన పొరపాటులో నీకు కూడా భాగం వుందనిపించడం లేదా. నువ్వు అర్ధాంగివి మాత్రమే కాదు. ఇంటి కోడలిగా నీ బాధ్యతేమిటో తెలుసుకున్నావా?'' నాలోని స్త్రీ హృదయం ఎప్పటికప్పుడు నిలదీస్తూనే వుంది.

'కొడుకు జీవితంలో వసంతాన్ని పూర్తిగా నింపేసి శూన్యంతో మిగిలిపోయిన తల్లి కోకిల! ఏ ఎడారిలో ఒంటరిగా విలవిల్లాడుతోందో?'

తలచుకుంటుంటే కన్నీళ్ళు! మనసులో వరద గోదారి సుడులు! చుట్టుపక్కలను మరిచిపోయి మరీ గతంలోకి వెళ్ళిపోయాను. హఠాత్తుగా ఎవరో కుదిపినట్టయి ప్రస్తుతానికొచ్చాను. మావారు చేతితో భుజం మీద మెల్లిగా తడుతున్నారు.

మావారివైపు చూశాను. ఆయన కళ్ళల్లో నీళ్లు. కన్నీళ్ళు నిండిన కళ్ళతోనే నన్ను అనునయిస్తున్నారు.

అంతేకాదు! మరో భావం కూడా స్ఫురిస్తోంది.

'అమ్మను మనం తీసుకెళ్ళిపోదాం, అత్తయ్యగారు మనింటికి వచ్చేయాలి'.

ఒకే కోరికతో హృదయాలు ఆరాటపడుతున్నాయి.

మావారిచ్చిన ఊరగాయల లిస్టు చదువుతూ మరీ సీసాల్లో పెట్టిస్తున్న అత్తయ్యగారిని చూడగానే హఠాత్తుగా మాకు ఆశ్చర్యం. సూది మొనలాంటి ఆలోచన 'అత్తయ్యగారికి చదువొచ్చు'. అంటే మావారు డబ్బు తీసుకున్నప్పుడు ఆవిడకు చదువు రాదనుకున్న మేము... వశం తప్పిపోతున్న పరిస్థితి!

తల వంచుకుని నిలబడ్డాం. ''మీరు అడిగినవన్నీ సర్దటమయింది. ఇంకా ఏమైనా కావాలా?'' మెల్లిగా తలెత్తి ఆవిడవైపు చూశాం.

చూపుల్లోనూ, మాటలోనూ ఎటువంటి భావం లేదు

''అమ్మా... నువ్వు మాతో వచ్చేయ్'' దుఃఖపశ్చాత్తాపంతో మాట్లాడుతున్నారు ఆయన.

''అత్తయ్యగారూ ఇన్నాళ్ళూ మీరు లేకపోయినా మా ధ్యాసంతా మీమీదే'' ప్రార్థనాభావంతో అడిగాను.

''నా ఆలోచన కూడా అదే! మీరొచ్చి నన్ను చూడాలని'' అత్తయ్యగారు మాటలు వినగానే మాలో చెప్పలేని సంతోషం.

''అప్పట్లో నాకేమీ తెలిసేది కాదు. చెట్టంత కొడుకు నీడలో వున్న నాకు లోటేమిటని! కాని నిలకడ లేని మనసిచ్చే నీడ స్థిరమైంది కాదని అర్థమయింది. చెట్లు కొనుక్కుంటే ఎంతో ఉపయోగమని చెప్పాక పరిస్థితినర్థం చేసుకున్నాను. నా కొడుకు కొన్నానన్న చెట్లు ఎప్పుడు వస్తాయో తెలియక బాధపడుతుండేదాన్ని'' ఆవిడ చెపుతున్న గతం ఒక అస్త్రంలా మా గుండెల్ని పిండి చేస్తోంది!

''చెట్టును వెతుక్కుంటూ నేనే బయలుదేరాను. మాఊరి పోస్ట్‌మాస్టారు నాకు వచ్చే పెన్షన్ డబ్బులతో ఒక్కొక్క చెట్టూ కొనిపించారు. ఈ చుట్టుపక్కలనున్న చెట్లన్నీ నేను పెంచుకున్నవే!'' ఆ మాటల్లో అనుభవం నేర్పిన వేదం.

''చెట్టు తనని పెంచి పోషించిన మనిషిని మర్చిపోదు. తనకంటూ బ్రతుకునిచ్చిన వాళ్ళకి బ్రతుకు తెరువునిస్తుంది. అండగా నిలుస్తుంది. ఉన్నచోటునే నమ్ముకుని తనని నమ్ముకున్న వాళ్ళకి నీడనివ్వటం చెట్టు స్వభావం!

ఆడదానిగా పుట్టి ఎవరి పంచనా వుండడం కంటే చెట్టుగా పుట్టి తోబుట్టువులా పచ్చగా బతకటమే సుఖం'' ప్రస్తుత జీవితానికి నిర్వచనం ధ్వనిస్తోంది.

''అర్థం చేసుకునే మనసుంటే ఎన్నెన్ని భావాలతో చెట్లు పలకరిస్తాయి. చెట్లు మాట్లాడలేవు. కాని చేతలు తెలుసు. నేను పోగొట్టుకున్న వసంతం వీటి నీడలోనే తిరిగి పొందగలిగాను. ఇది నా జీవన అనుభూతి!''

అలా మాట్లాడుతున్న ఆవిడనే చూస్తూ వుండిపోతున్నాం. ''కాని ఒక నిజం నేను చెప్పాలి. నేను మీతోపాటే వుండిపోయుంటే ఇవన్నీ ఈరోజు నేను పొందగలిగేదాన్నా! అలాంటి అవకాశమిచ్చిన మీకు నేను కృతజ్ఞురాలిని.'' క్షణకాలం మౌనం.

''మామ్మగారూ, ఊరగాయ మామ్మగారూ అంటే నన్ను వెతుక్కుంటూ వచ్చే మనుషుల్లో ఆత్మీయతను ఒదులుకోలేను. ప్రతిపూటా వసంతంలా కనిపించే ఈ చోటు విడిచి రాను! రాలేను!'' తిరిగి తన పనిలో వుండిపోయారు ఊరగాయ మామ్మగారు.

జీవితంలో ప్రతీక్షణానికి ఒక ప్రత్యేకత వుంది. ఏ క్షణంలోనైనా మనిషి జీవితాన్ని మార్చగలిగే మహత్తర శక్తి వుంది. ప్రత్యక్ష ఉదాహరణ ఆవకాయ చెట్టులాంటి ఊరగాయ మామ్మగారు!

''ఇప్పుడెన్ననుకునేం లాభం?'' అంతరాత్మ వెటకారం!

★